# టాంక్‌బండ్ కథలు



చంద్ర ప్రతాప్

# టాంక్‌బండ్ కథలు

రచన

**చంద్రప్రతాప్**

ప్రచురణ

**శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్**

బ్లాక్–6, ఫ్లాట్–10, హెచ్.ఐ.జి–1

బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్–500 044.

సెల్: 9391343916

# విషయ సూచి


| | | |
|---|---|---|
| 1. | నిమజ్జనం | 9 |
| 2. | అర్జంట్ | 13 |
| 3. | విగ్రహం | 16 |
| 4. | ఆడపిల్ల తండ్రి | 20 |
| 5. | జవాబులేని ప్రశ్న | 23 |
| 6. | గొలుసు | 27 |
| 7. | గెలుపు | 31 |
| 8. | తప్పు | 35 |
| 9. | శత్రువు | 39 |
| 10. | ప్రాయశ్చిత్తం! | 42 |
| 11. | కావేరి | 45 |
| 12. | బోటు షికారు | 51 |
| 13. | బ్యూటీక్వీన్ | 55 |
| 14. | ఇద్దరు మిత్రులు | 59 |
| 15. | మళ్లీ అమ్మదగ్గరకి | 63 |
| 16. | రక్త సంబంధం | 67 |
| 17. | కిడ్నాప్ | 71 |
| 18. | ఉద్యోగం | 75 |
| 19. | వీడని నీడ | 78 |
| 20. | దోపిడి | 82 |
| 21. | శాపం | 86 |
| 22. | అరుంధతి | 89 |
| 23. | తేనె ప్రవాహం | 93 |
| 24. | తీర్పు | 98 |
| 25. | శరణ్య | 102 |
| 26. | నాన్నా! నేను మారాను | 106 |
| 27. | ఆమె ఎందుకేడ్చింది? | 110 |
| 28. | ఉందిలే మంచికాలం ముందు ముందునా | 114 |
| 29. | బతుకు దారి | 118 |
| 30. | సిమ్‌కార్డు | 123 |
| 31. | ఎన్‌కౌంటర్ | 128 |
| 32. | సుఖం | 132 |
| 33. | తాతబ్బాయి | 136 |
| 34. | రూపాసింగ్ | 139 |
| 35. | ఆకలి | 143 |
| 36. | వెయ్యి రూపాయల నోటు | 147 |
| 37. | త్యాగం | 151 |
| 38. | శాడిజం | 156 |
| 39. | సౌదామిని ఆంటీ! | 160 |
| 40. | ఔదార్యం ఖరీదు | 164 |
| 41. | ఓ ఖాకీ కన్నీళ్లు! | 168 |
| 42. | పిల్లల దొంగ | 172 |
| 43. | క్షమ | 175 |

# నిమజ్జనం

**జ**నం... ఎటు చూసినా జనం! వందలు.. వేలు.. లక్షలు! గణపతి నిమజ్జనం సందర్భంగా జంట నగరాల ప్రజలేకాక సమీప గ్రామాల నుంచి, పట్నాలనుంచీ హుస్సేన్‌సాగర్ తీరానికి ప్రవాహంలా తరలివస్తున్నారు జనం.

జనసముద్రం మీద నుంచి 'గణేష్ మహరాజ్‌కీ జై' అన్న నినాదాలు అలలు అలలుగా తేలుతూ గాలిలో కల్సిపోతున్నాయి. కేకలు.. అరుపులు.. కేరింతలు.. నవ్వులు.. ఎటుచూసినా కోలాహలం! పరవళ్లు తొక్కుతున్న ఉత్సాహం!!

నిర్విరామంగా పనిచేస్తూ వేలాది గణపతి విగ్రహాల్ని సాగర గర్భంలోకి చేర్చుతున్నాయి క్రేన్‌లు. అయినా ఇంకెన్నో విగ్రహాలు.. రకరకాల భంగిమలలో.. అలంకారాలలో... లారీల్లోనూ, ట్రక్కుల్లోనూ బారులుతీరి తమవంతుకోసం నిరీక్షిస్తున్నాయి. ఉత్సవసమితి నిర్వాహకులు ఎత్తయిన వేదికల మీద నిలబడి గణపతులకు స్వాగతం పలుకుతున్నారు. కాషాయరంగు టోపీలు ధరించిన కార్యకర్తలు ఆ జనసముద్రంలో వేగంగా కదులుతూ, తటాక తీరానికే వింతశోభను కలిగిస్తున్నారు. సాయంత్రం అయ్యే కొద్దీ జనసముద్రం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతోంది. వచ్చేవాళ్లు వస్తున్నారు, పోయేవాళ్లు పోతున్నారు. చిరుతిండ్లు అమ్మే బండ్లు, దుకాణాలు జోరుగా వ్యాపారాలు సాగిస్తున్నాయి.

ఆ జనాన్ని చూస్తూ ఆశ్చర్యంతో నోరు తెరిచింది రాములమ్మ.

పల్లెనుంచి వచ్చిన రాములమ్మ తన జీవితంలో అంత మంది జనాన్ని ఎప్పుడూ చూడలేదు. వేలాది రూపాయలుపోసి చేసిన బొమ్మల్ని నీళ్లలో కలిపేయడం అంటే లక్షలాది రూపాయలు గంగపాలు చేస్తున్నట్లే గదా? అని ఆమె పేద హృదయం సన్నగా మూలిగింది. తనలాంటోళ్లు ఎన్ని జన్మలెత్తి రెక్కలు ముక్కలు చేసుకుంటే ఒక లక్ష రూపాయలు సంపాదించగలరు?

"సూడే అమ్మా.. ఆ ఇనాయకుడెంత బాగుండాడో!" అంటూ యాదగిరి చెయ్యిపట్టుకొని గుంజడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చింది రాములమ్మ.

నాలుగేళ్లన్నా నిండని యాదగిరి సీమటపాకాయ లాంటివాడే! ఉన్నచోట ఉండే రకం కాదు. 'రాయే.. అమ్మా! ఇంకా ఎదరకి బోయిసూద్దాం.. నాకీడనుంచుంటే ఏం కనబడ్డంలేదు"అని అక్కడికి వచ్చినప్పటినుంచీ శతపోరుపెడ్తున్నాడు వాడు.

"వద్దయ్యా.. ఎదరకెల్తే జనం తోపిడికి నీళ్లల్లో పడిపోతాం.. ఈడ్నే నుంచోని సూద్దాం"

"అయితే ఎత్తుకొని సూపించు.." ఉడుంపట్టు పట్టాడు యాదగిరి.

అందాకా ఎత్తుకొని, ఎత్తుకొని రెక్కలు పడిపోతున్న రాములమ్మకి ఏం చేయాలో తోచలేదు. ఒక పావలా పెట్టి ఐస్‌ఫ్రూట్ కొని కొడుకు చేతిలో పెట్టింది. అది తింటూ వరుసగా వస్తున్న విగ్రహాల్ని చూస్తూ నిలుచున్నాడు యాదగిరి.

ముఠామేస్త్రి రమ్మంటే కట్టుబడి పనికి తక్కిన కూలీలతో కల్సి నిన్ననే నగరానికి వచ్చింది రాములమ్మ. వినాయకుడి నిమజ్జనం బ్రహ్మాండంగా ఉంటుందంటే ఈ రోజెలాగూ పని లేకపోవడంతో కొడుకును వెంటపెట్టుకొని అక్కడికి వచ్చిందామె. ఈ నగరమూ.. ఇక్కడి ప్రజలూ పుట్టలోంచి బయటకు వచ్చే చీమల్లా ఈ వాహనాలూ.. పెద్ద పెద్ద భవనాలు చూస్తుంటే తనేదో మరో ప్రపంచంలో విహరిస్తున్నట్లుంది రాములమ్మకు.

"అమ్మా ఎదరకెళ్లి ఇనాకుడ్ని నీళ్లలో ఎలా పడేస్తారో సూద్దామే" ఐస్‌ఫ్రూట్ తినడం పూర్తవగానే మళ్లీ నసమొదలెట్టాడు యాదగిరి. చెప్పీ చెప్పీ విసుగెత్తిపోయిన రాములమ్మ కోపం పట్టలేక వాడి వీపు మీద రెండంటించింది. అంతే... ఆరునొక్క రాగం ప్రారంభమైంది.

ఇక లాభం లేదని ఓ రూపాయి పెట్టి మిఠాయి కొని వాడి చేతిలో పెట్టింది తల్లి. బుగ్గలమీద నీటి చారికల్ని పైట కొంగుతో తుడిచి, చిన్నగా ముద్దాడిందామె. మిఠాయి తింటూ మౌనంగా వచ్చేపోయే జనాన్ని చూడసాగాడు యాదగిరి.

ఇంతలో రంగురంగుల పంజాబీ డ్రెస్సులు, జీన్స్‌ప్యాంట్లు, మిడ్డీలు ధరించిన అమ్మాయిల గుంపు నవ్వుతూ, తుళ్లుతూ రావడం రాములమ్మ కంటబడింది. లేత గులాబీ రంగులోనున్న వాళ్ల శరీరాలు ముట్టుకుంటేనే మాసిపోతాయేమో అన్పిస్తున్నాయి. తలకట్టునుంచి, కాలిజోళ్లవరకూ రకరకాల ఫేషన్లతో ఒకర్నిమించి ఒకరు కళకళలాడిపోతున్నారా అమ్మాయిలు.

తనూ ఉంది. ఎందుకు? రెండే రెండు చీరలు.. అవీ అక్కడక్కడా పిగిలిపోయి అతుకులుపడి ఉన్నాయి. తనూ వాళ్లవయస్సుదే అయినా తిండీ తిప్పల్లేక ఎముకల పోగులా తయారైంది. అదీగాక తెల్లారిలేచింది మొదలు రాత్రి పడుకునేంత వరకూ గాడిద చాకిరీ! పెళ్లాం బిడ్డల్ని పోషించాల్సిన మొగోడు పెళ్లాం సంపాదన్ని కూడా తాగుడికే తగలేస్తుంటే ఏం చేయగలదు తను? మొగుడు గుర్తుకు రాగానే "ఎద్దెమొగపోడు"అని కసిగా తిట్టుకుంది రాములమ్మ.

"గాడీ ఆరే.. హఠ్‌జావ్... హఠ్‌జావ్!'' అంటూ పోలీసులు లాఠీతో గదమాయించే సరికి ఊహల్లోంచి వాస్తవంలోకి వచ్చిన రాములమ్మ గుండె ఒక్కసారి ఝల్లుమంది!

" ఏడీ పోరడు...?"అని మెల్లగా అనుకొని "కొడుకా యాదగిరీ!"అని పిలుస్తూ నలుదిక్కులా చూసింది.. వాడెక్కడా కనబడలేదు. "బిడ్డా.. బిడ్డా.."అంటూ ఆ జనంలో పిచ్చెక్కినట్లు తిరిగిన రాములమ్మకు నిరాశే మిగిలింది. కళ్లవెంట నీళ్లు ధారాపాతంగా కారిపోతున్నాయామెకు. ఎందరెందరినో తన కొడుకు గురించి అడిగింది. అంతా పెదవి విరిచారే తప్ప తన గోడెవరూ పట్టించుకోవడం లేదు. దుఃఖం వెక్కిళ్ల రూపంలో ఎగదంతోంది. " ఒకేల నీల్దగ్గిరికి పోయాడేమో..." ఆలోచన వచ్చిందే తడవు తూనీగలా జనాన్ని చీల్చుకుంటూ వెళ్లి సాగర తీరమంతా వెదికింది. ఇప్పుడామెకు నీళ్లలో పడిపోతానన్న భయంగానీ, బెంగగానీ లేదు.. తన కొడుకేమైపోతాడోనన్న ఆలోచనే ఆమెని నిలువెల్లా వణికించేస్తోంది.

యాదగిరి ఎక్కడా కన్పించ లేదు.

"పోలీసోళ్లకి చెప్పమ్మా?" సలహాయిచ్చారెవరో.

గబగబా ఓ పోలీసు దగ్గరికి వెళ్లింది.

"అదుగో.. ఆడ ఠానా ఉంది! ముందాడ కంప్లెంటియ్యి. తర్వాత మేం ఎదుకులాడతాం"అన్నాడా కానిస్టేబుల్ తాపీగా కారాకిల్లీ నములుతూ.

పిచ్చిపట్టిన దాన్లా అటు పరుగెత్తిన రాములమ్మకి అతను జెప్పిన పోలీస్ స్టేషన్ ఎక్కడా కన్పించలేదు.

''ఎంత పని జేసినవ్‌రో కొడుకా...'' శోకాలు పెడుతూ చీకట్లో కొట్టుమిట్టాడుతున్నదాన్లా ఆ జనంలో దారీ తెన్ను తెలియక గిజగిజలాడిపోతోందామె.

“పిల్లోడ్ని తెచ్చిందానివి జాగర్త ఉండక్కర్లే...” ఎవరో పెద్దాయన విసుక్కుంటున్నాడు.

అంతలో ఒడ్డున ఉన్న జనం ఘొల్లున అరిచారు.

“ ఏమైంది?... ఏమైంది?”

“నాలుగేళ్ల గుంటడెవడో నీళ్లలో పడ్డడంట..”

ఆ మాటలు చెవుల్లో పడ్డంతోనే “బాబూ యాద్గిరీ...” అంటూ బాణంలా పరిగెత్తిన రాములమ్మకు బుడ్డోడు మునకలేస్తూ కన్పించాడు.

వెంటనే వెనకాముందూ చూస్కోకుండా చెరువులో దూకేసిందామె. అంతకు ముందే అందులో పడేసిన బొమ్మతాలూకు ఇనుప చువ్వేదో బలంగా ముఖానికి తగలడంతో ప్రాణాలు పైనే పోయాయన్పించిందామెకు. అయినా బాధపడలేదు. ముఖం చిట్లి రక్తం వస్తున్నా లెక్కచేయక మునిగిపోతున్న బిడ్డని వడిసి పట్టుకొని ఒడ్డుకు లాక్కొచ్చింది కాని...

ఆ పోరడు యాదగిరి కాదు...

అప్పుడే ఎవరో తండ్రి  ఆదుర్దాగా వచ్చి ఆ బిడ్డని అందుకొని హృదయానికి హత్తుకున్నాడు.

తడిసిన బట్టలు నీళ్లోడుతుంటే ఒడ్డున నిలబడి పిచ్చి చూపులు చూస్తున్న రాములమ్మ చెవులకు “అమ్మా...” అన్న చిరపరిచితమైన పిలుపు... అమృత జల్లులా సోకింది.

ఒడ్డునే నిలబడి తనవంకే ఆశ్చర్యంగా చూస్తున్న యాదగిరి కంటబడ్డంతోటే ఆమె ముఖం సూర్యబింబంలా ఎర్రగా వెలిగిపోయింది.

అందుకు గుర్తు అనిపించేలా ముఖంపైన గాయం చిక్కని, ఎర్రటి నెత్తుర్ని స్రవిస్తూ – కోటి సూర్యప్రభాసముజ్వలంగా ప్రకాశిస్తోంది! గుండెలోని బాధనంతటినీ నిమజ్జనం చేసి ఒడ్డుకు వస్తున్న ఆ తల్లిని చూసి పక్కకు దారిచ్చారు జనం.

# అర్జంట్

సెల్‌ఫోన్ రింగయింది.

ఆ రింగ్‌టోన్ వినగానే అందాకా సరదాగా నవ్వుతున్న అతని ముఖంలో ఒక లాంటి విసుగు! అయినా వీలైనంత సంతోషాన్ని గొంతులో నింపుకుని “హాయ్ ప్రసూ... హౌ ఆర్యూ?” అన్నాడు.

ఆ తర్వాత “... అబ్బే ఇంకెక్కడ? ఇంకా ఆఫీసులోనే తగలడ్డా! ఇంకా కనీసం రెండు గంటలైనా పడుతుంది బయటపడేసరికి. మా బాసాసురుడు ఉదయం నుంచీ పెండింగ్ వర్క్ మీద క్లాసు పీకుతునే ఉన్నాడు” అంటూ ట్యాంక్‌బండ్ మీది సోఫాలో రిలాక్స్‌డ్‌గా వెనక్కు వాలాడు రాజశేఖర్. అతని ఒళ్లో పడుకున్న సంధ్య నిశ్శబ్దంగా నవ్వుతూ అతన్నే చూస్తోంది.

“సరే నీసంగతేంటి డియర్?” సంధ్య బుగ్గమీద వేలితో సున్నాలు చుడుతూ అడిగాడు రాజశేఖర్.

తర్వాత అతనే– “మైగాడ్.. తలనొప్పా? సారిడనో.. అనాసినో వేసుకోకపోయావ్? ఓ బిళ్ల వేసుకుని వేడిగా ఓ కప్పు కాఫీ తాగితే రిలీఫ్ వస్తుంది...”

“.......”

“వెంటనే రమ్మంటే ఎలా? వాడు నా పీక పిసుకుతాడు...”

అతనామాట అనగానే సంధ్య లేచి రాక్షసిలా నోరు తెరిచి, రాజశేఖర్ పీక పిసకబోయింది.

అతను ఆమె బుగ్గమీద చిటికేస్తూ.. “ఫర్వాలేదులే.. ఒక్క పావుగంట అమృతాంజనం పట్టించి విశ్రాంతి తీసుకో తగ్గిపోతుంది...”

ఫోన్ డిస్‌కనెక్టయింది.

“హమ్మయ్య... సిగ్నల్స్ ఫెయిలై రక్షించాయి” అంటూ నవ్వుతూ సంధ్య ముంగురులు సవరించాడు రాజశేఖర్.

"ఔరా నువ్వు రాజశేఖరుడివి కాదు. మహా నటశేఖరుడివే' కిలకలా నవ్వింది సంధ్య.

"తప్పదమ్మా... కొన్ని పరిస్థితుల్లో నటించక తప్పదు. అయినా ఈ సంధ్యా సుందరికోసం ఇలాంటి నటనలింకెన్ని చేయాలో..."

మళ్లీ ఫోన్ రింగయింది.

"ఏమిటి? నన్నిలా తడవతడవకీ డిస్ట్రబ్ చేస్తే నేను పదింటికి కూడా బయటపడలేను డార్లింగ్!... ఏమిటీ కళ్లు తిరుగుతున్నాయా? బీపీ డౌనయిందేమో? ఓ పన్చెయ్! ఓ గ్లాసుడు నీళ్లలో ఓ చెంచా ఉప్పేసుకుని తాగు. పది నిముషాలకల్లా అంతా నార్మల్ అవుతుంది" అంటూ ఫోన్ కట్ చేశాడు రాజశేఖర్.

"ఆమెకంత బాగా లేనప్పుడు వెళ్లకూడదా రాజూ?" అంది సంధ్య. అపరాధభావం ఆమె కళ్లలో మెదుల్తోంది.

"ఆవిడకి మున్నూటరవై అయిదు రోజులూ.. ఏదో ఒక సమస్య ఉంటూనే ఉంటుందిలే.. అదిసరే సంజూ ఆ శ్రీశ్రీగారి విగ్రహాన్ని చూస్తుంటే నీకేమన్పిస్తుంది?'

"నీకేమన్పిస్తుంది?"

"శ్రీశ్రీ గారిని.. ఆయన బొమ్మచుట్టూ గిరికీలు కొడుతూ కింద ఆడుతున్న ఆ పిల్లల్ని చూస్తుంటే ఆయన రాసిన – వానకురిస్తే.. మబ్బుమెరిస్తే.. ఆకసమున హరివిల్లు విరిస్తే గీతం మనసులో మెదులుతుంది. మనసంటే గుర్తొచ్చింది.. శ్రీశ్రీ గారి 'మనసున మనసై బతుకున బతుకై' పాట గుర్తుందా నీకు?...'

మళ్లీ ఫోన్ రింగయింది.

"ఓ గంటసేపు దీని గొంతు నొక్కేస్తే గానీ తిక్క కుదరదు..." అంటూ చాలా విసుగ్గా "హలో ఏంటి? నన్ను ఆఫీసులో పనిచేసుకోనిస్తావా లేదా? ఏమిటీ.. మా అమ్మకు రెండు రోజుల నుంచీ వామిటింగ్స్ మోషన్సూనా? ఎవరు చెప్పారు? శ్రీరామ్ ఫోన్ చేసాడా? సర్లే! రేపు సాయంత్రం ఆఫీసులో పర్మిషన్ తీసుకుని వెళ్లి చూసొస్తా.. ఆ.. ఇంకేమిటి? అరగంట నుంచీ నీకూ వాంతులవుతున్నాయా? మధ్యాహ్నం ఏం తిన్నావు? అజీర్ణం చేసి ఉంటుంది. ఓ జెల్సిల్ నోట్లో వేసుకో! అలాగే ఫ్రిజ్‌లో ఈనో ఉంది కదా? కాస్తంత పౌడర్ నీళ్లలో కలుపుకుని తాగు పావుగంటలో తగ్గిపోతుంది" అంటూ ఫోన్ కట్ చేశాడు రాజశేఖర్.

"అమ్మో రాజశేఖర్ మీ మిసెస్‌తో ఎలా వేగుతున్నావోగానీ గంటలోపే ఇన్ని అనారోగ్య సమస్యలా? మైగాడ్" సానుభూతి చూపింది సంధ్య.

"హమ్మయ్య ఇప్పటికైనా నా పరిస్థితి నీకర్థమైంది థ్యాంక్స్. ఇల్లు కాదది నరకం! ఇంట్లో కాలు పెడుతూనే సమస్యల దండకం వల్లెవేయడం మొదలవుతుంది.. ఇక చిరాకు పుట్టమంటే ఎందుకు పుట్టదు?"

"నిజమే ఇలాగైతే ఎవరికైనా కష్టమే"

"అందుకే శ్రీశ్రీగారి 'మనసున మనసై' గీతం అంటే పడిచస్తాను. అది వింటుంటే– నువ్వు నమ్ముతావో లేదోగానీ సంజూ! నువ్వే నా కళ్లముందు మెదుల్తావ్..."

"అహ అలాగా?'

"ఔను.. ఏదైనా అదృష్టం ఉండాలి.."

అతనేదో అనబోతుంటే ఫోన్ రింగైంది. మళ్లీ ఆవిడనుంచే–

"హలో..."

'.....'

రాజశేఖర్ ముఖంలో రంగులు మారతుంటే ఆందోళనగా అతనివంకే చూస్తోంది సంధ్య ఏమర్థంకాలేదు.

"సరే! ఇప్పుడే బయల్దేరుతున్నా..." అంటూ ఫోన్ కట్‌చేసి – "సంధ్యా లే.. తొందరగా ఇంటికి వెళ్లాల్సి ఉంది..." అంటూ హడావిడిగా లేచాడు రాజశేఖర్.

"ఏమిటి ఏమైంది ఎనీథింగ్ సీరియస్?"

"అలాంటిదే.. పెన్సిల్ చెక్కుతుంటే బాబిగాడికి వేలు తెగిందట.. ఎంత తెగిందో ఏం పాడో నెత్తురొస్తోందట.. సర్లే మనం మరోసారి కలుద్దాం బబై'"

అంటూ బైక్‌స్టార్ట్ చేసి రివ్వున ముందుకు దూకించాడు రాజశేఖర్.

"ఏంటో ఈ మనిషి తీరు" అనుకుంటూ చెదిరిన బట్టల్ని సర్దుకుంటూ తన స్కూటీ వైపు నడిచింది సంధ్య.

# విగ్రహం

సాయంత్రం 5 గంటలు!

ట్యాంక్‌బండ్ మీది రామదాసు విగ్రహానికి ఆనుకునున్నాడు సుందరం. మాసిన గడ్డం, అతుకులు పడ్డ చొక్కా, ప్యాంట్ అతని పేదరికాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

పొట్ట చేతపుచ్చుకుని, ఉద్యోగంకోసం తను నగరంలో అడుగుపెట్టి అప్పుడే ఆర్నెల్లు. తండ్రి కొనిచ్చిన ఆరు చెప్పుల జతలు అరిగిపోయాయే తప్ప ఉద్యోగం దొరకలేదు. ఎక్కడో మారుమూల గ్రామాన్నుంచి గంపెడు ఆశతో నగరానికి చేరుకున్న సుందరానికి తన ఆశ అడియాసేనని తేలిపోయింది.

తనేదో తవ్వి తలకెత్తుతాడని, కూలీ నాలీ చేసి నెలకు రెండొందలు, మూడొందలు పంపుతున్న తల్లిదండ్రులు గుర్తుకు రావడంతో సుందరం మనసు బాధగా మూలిగింది.

మొన్న పండక్కి ఇంటికి వెళ్లినప్పుడు 'కొల్వు దొరకబట్టేనా బిడ్డా?' అని ఆప్యాయంగా, ఆశగా అడిగిన అమ్మకు ఏం చెప్పాలో అర్థంకాక తెల్లమొగమేశాడు తను.

'ఆడికి కొలువైతే రెక్కలు కట్టుకొచ్చి చెప్పడేంటే ఎర్రిమొగమా? జరంతవోపు. కొలువదే అయిద్ది. మన దరిద్రమూ వదిలి పోద్ది! నా బిడ్డ నాలా రెక్కలు ముక్కల్జేసుడు వద్దనేగదా ఇస్కూలుకు పంపింది. గాచారం బాలేక ఉజ్జోగమింకా గాలేదు కానీ ఆడికేమే దొరబిడ్డ!' తండ్రి మాటల్లో ఆయన తనపై పెట్టుకున్న నమ్మకం అర్థమై మనసు కుంగిపోయింది.

ఈ వయసులో తల్లిదండ్రులకు పెట్టాల్సిందిపోయి వాళ్ల రెక్కల కష్టాన్ని జుర్రుకుంటున్నాడు తను. ఛీ ఏం బతుకు? అయినా ఇలా ఎన్నాళ్లని? ఎక్కే గడప దిగే గడప. అక్కడ అమ్మనాన్నల దీనావస్థ! పోనీ ఆత్మహత్య చేసుకుంటే?

ఆ ఆలోచన రాగానే పైకి లేచాడు. అంతలో అక్కడకి సీలు వేసున్న ఓ అట్ట పెట్టె మోసుకుని ఇద్దరు వచ్చారు.

‘ ఏయ్ మిస్టర్ ఎవర్నువ్వు? ఇక్కడేం చేస్తున్నావ్?’ వారిలో ఒకడి గొంతు ఖంగుమంది.

‘ ఇంతకీ మీరెవరు?’ ధైర్యం కూడదీసుని అడిగాడు సుందరం.

‘పోలీస్’ అన్నాడు రెండోవాడు.

ఉలిక్కిపడ్డాడతను. దాన్ని కప్పిపుచ్చుకుంటూ ‘నేనో నిరుద్యోగిని సార్. సికింద్రాబాద్‌లో ఓ ఇంటర్వ్యూకు హాజరై వస్తూ కాసేపు రెస్ట్ తీసుకుంటున్నాను’ అన్నాడు వీలైనంత వినయంగా.

‘గుడ్.. మాకో హెల్ప్ చేస్తావా? జస్ట్ అరగంట పని. రెండు వేలిస్తాం’

రెండువేలనేసరికి సుందరం కళ్లు మెరిసాయి.

‘చెప్పండి సార్ ఏంచేయాలి?’

అరగంటపనికి రెండు వేలు అంటున్నారు ఏం పనో? ఏం రిస్క్ చేయాలో అనే సందేహం వచ్చినా జేబులో కానీలేని అతని పరిస్థితి, కడుపులో ఆకలి ఆ సందేహాన్ని అతని దేహంలోనే సమాధి చేశాయి.

‘మ్యూజియానికి వెళ్దామా?’ అన్నడు మొదటి వాడు.

‘నీ బొంద ఇవ్వాళ శుక్రవారం సెలవు. పబ్లిక్ గార్డెన్స్ లలిత కళాతోరణంలో ఏడింటికి ఏదో సినిమా ఫంక్షన్ ఉంది అక్కడికి వెళ్దాం’ అంటూ రెండు ఆటోలను పిలిచాడు రెండోవాడు. సుందరాన్ని పెట్టెసహా ఒక దాంట్లో ఎక్కించి, రెండో దాంట్లో వారిద్దరూ కూర్చున్నాక ఆటోలు బయలుదేరాయి.

ఏడు నిముషాల్లో ముగ్గురూ లలితకళా తోరణం చేరుకున్నారు. అక్కడ వారికి మరొకడు జతయ్యాడు. పెట్టెలో నుంచి కొన్ని వస్తువుల్ని, పరికరాల్ని తీసుకుని పోలీసులిద్దరూ వేదికవైపుగా వెళ్లగా ప్రేక్షకుల గ్యాలరీలోకి మూడో వ్యక్తితో కలిసి వెళ్లాడు సుందరం. ఆ మూడోవ్యక్తి గొప్ప టెక్నీషియన్‌లా ఉన్నాడు. పెట్టెలోని సెల్‌ఫోన్లు తీసి ఫీడింగ్ చేసి గ్యాలరీ మూలల్లో రెండు చోట్ల అమర్చాడు. అతని చేతులు చకచకా యంత్రాల్లా కదుల్తుంటే పెట్టెలోంచి అతనికి కావాల్సిన వస్తువులు, పరికరాలు అందిస్తూ సహకరించాడు సుందరం. తర్వాత అతని సూచన మేరకు వాటిపై పూలకుండీలు, పుష్పగుచ్ఛాలూ ఉంచాడు తను.

సుందరంలో సన్నగా ఏదో అనుమానం! అయినా బయటపడలేదు.

మరోపావుగంటలో వేదికవైపు వెళ్లిన వారిద్దరూ వచ్చి కలిశారు. ఆ ముగ్గురూ తనకు విన్పించకుండా ఓ పక్కగా నిలబడి ఏదో మాట్లాడుకున్నారు. తర్వాత గుప్పిట మూసి బొటనవ్రేలు పైకి లేపి నవ్వుతూ వెళ్లిపోయాడు మూడోవ్యక్తి.

అతను పోగానే ఫెళఫెళలాడుతున్న వెయ్యిరూపాయల నోట్లు రెండు సుందరం చేతిలో పెట్టి ప్రేక్షకుల్లో కలిసిపోయారు పోలీసులు.

చేతిలో కరెన్సీ పడగానే రెండు రోజులుగా మంచినీళ్లతో కడుపు నింపుకుంటున్న సుందరంలో ఆకలి పెద్దపులిలా గాండ్రించింది. గబగబ పక్కనే ఉన్న హోటల్‌కు వెళ్లి బిర్యానీకి ఆర్డర్ చేశాడు.

పోలీసులంటారు.. అసలు వీళ్లు నిజం పోలీసులేనా? ఆ సెల్‌ఫోన్లేంటి? కొంపతీసి బాంబులు కాదుకదా? క్రమంగా అనుమానం పెరిగి పెద్దదయింది సుందరంలో.

'ఆ మనకెందుకు? ముందు ఆత్మారాముడి సంగతి చూడాలి. ఆ తర్వాతే ఏదైనా!' అనుకుంటూ బేరర్ అప్పుడే తెచ్చిన బిర్యానీప్లేటుపై దాడి ప్రారంభించాడతను.

రెండు స్పూన్లు తిన్నాడో లేదో అతనిలో మళ్లీ ఆలోచనలు.. తను ఆడిటోరియం నుంచి వెలికి వచ్చేటప్పుడు నవ్వుతూ తుళ్లుతూ పువ్వుల్లాంటి పిల్లలు ఎదురయ్యారు. చంకన పసిబిడ్డల్ని వేసుకుని వస్తున్న తల్లులు! అభిమాన నటుల్ని చూడబోతున్నామన్న ఆనందం వాళ్లముఖాల్లో తాండవిస్తోంది.. నిజంగా అవి బాంబులే అయితే వారంతా..అతని ఆలోచనల్ని భగ్నం చేస్తూ –

పెద్ద విస్ఫోటం!! అంతా ఉలిక్కిపడ్డారు.

అంతే! రాకెట్‌లా స్టేడియంలోకి పరుగు తీశాడు సుందరం. వేదిక వెనుక బాంబు పేలినట్లుంది. జనంలో కలకలం! భయంతో ఉరుకులు.. పరుగులు.. ఎవరి గోలలో వారున్నారు. సుందరానికి హడావిడిగా పరుగుతీస్తున్న ఓ ఆడ పోలీస్ కన్పించింది...

'మేడమ్! గ్యాలరీలో కూడా బాంబులున్నాయి. తీసేద్దాం రండి' అరిచాడతను. అతనేం మాట్లాడుతున్నాడో ఆమెకి అర్థంకాలేదు. పిచ్చి చూపులు చూస్తూ పరుగెత్తిందామె.

ఇక లాభంలేదని గ్యాలరీ మధ్యకి తనే దూసుకుపోయాడు సుందరం. కొన్ని నిముషాల ముందు తాము సెల్‌ఫోన్లు అమర్చిన ప్రదేశానికి పరిగెత్తి 'వెళ్లండి.. బయటకు వెళ్లిపోండి.. అక్కడ కూడా బాంబులున్నాయి' అని అరిచాడు.

అదెంతో సేఫ్ ప్రదేశమని అక్కడే నిలబడి వేదికవైపు చూస్తున్నవారంతా కకావికలయ్యారు. ఈలోగా సుందరం సెల్ ఫోన్లు రెండూతీసి వైర్లు పీకి, స్విచ్ ఆఫ్ చేశాడు.

'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుని వెనుకకు తిరిగేసరికి తనకే రివాల్వర్ గురిపెట్టి నిలుచున్నాడు ఓ ఎస్సై. అతని పక్కనే తానిందాక చూసిన ఆడ పోలీసు కన్పించింది.

* * *

రిమాండ్‌లు.. లాకప్‌లు.. కోర్టులు.. విచారణలు.. అన్నీ పూర్తయ్యేసరికి వందలాదిమంది ప్రాణాలు కాపాడిన సుందరం ఒళ్లు పచ్చి పుండైంది. లేచి నిలబడలేని స్థితి! మరో ఆర్నెల్లకు అసలు నేరగాళ్లు పట్టుబడ్డారు. సుందరం నిర్దోషనీ, ఆరోజు తనవల్లే ఎందరో బతికిబట్టకట్టారనీ తేలేసరికి అతను ఈ లోకాన్నే విడిచిపోయాడు.

అయితేనేం?

లలితకళాతోరణంలో ఓ మూల అతని శిలావిగ్రహం వెలిసింది. ప్రతిరోజూ దానికి పూలదండలు వేస్తూ రెండు ముసలి ప్రాణాలు అక్కడే చాలాకాలం తచ్చాడి తర్వాత హరీమన్నాయి. ఆ తర్వాత ఆ విగ్రహాన్ని పట్టించుకున్న నాథులు లేరు!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Tankbund+Kathalu**

* * *